# అమ్మకానికి మదర్ డెయిరీ ఆస్తులు!

మొదటిపేజీ తరువాయి...

యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాల కాలంగా పాడి ఉత్పత్తి దారులకు ఆసరాగా నిలుస్తున్నది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 24 చిల్లింగ్ సెంటర్లు, 32 వేల మంది సభ్యులు, 432 సొసైటీల ద్వారా రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. 3లక్షల మంది వినియోగదారులకు పాలు, పాల ఆధారిత ఉత్పత్తులను అందిస్తున్నది.

**రూ.60కోట్ల అప్పులు అంటూ..**

మదర్ డెయిరీ 26వ సర్వసభ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఈ నెల 9న సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 2న హయత్‌నగర్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 'నార్మాక్ యూనియన్ రూ.60కోట్ల వరకు ఆర్థిక భారం ఏర్పడి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు యూనియన్ స్థిరాస్తులు విక్రయించడానికి చర్చించి నిర్ణయం తీసుకుకోవడానికి..' అని ఎజెండాలో స్పష్టం చేశారు.




**ఉమ్మడి నల్లగొండలో 30.5 ఎకరాల అమ్మకం**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూనియన్ పేరు మీద కొనుగోలు చేసిన భూములను అమ్మాలని స్కెచ్ వేశారు. నల్లగొండ జిల్లాలోని చిట్యాల పరిధిలో 29 ఎకరాలు, మిర్యాలగూడ పరిధిలోని 1.5 ఎకరాల భూమిని విక్రయించాలని ఎజెండాలో పేర్కొన్నారు.

**గతంలో ఒప్పుకోని బీఆర్ఎస్ సర్కారు**

పాడి రైతులకు వరంగా ఉన్న డెయిరీ ఆస్తులను అమ్మేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ససేమిరా అంది. గతేడాది సెప్టెంబర్‌లో మదర్ డెయిరీ ఎన్నికల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు క్యాంపులకు విజయ డెయిరీ మాదిరిగానే మదర్ డెయిరీకి గ్రాంట్లు ఇప్పించి, అప్పులు తీర్చేలా ఆదుకుంటామని ప్రకటించారని సభ్యులు చెబుతున్నారు. లీటరుకు రూ.4 బోనస్ ఇస్తామని చెప్పి పాల రేట్లను తగ్గిస్తూ వచ్చారని వాపోతున్నారు.

**ఆస్తులు విక్రయిస్తే ఉద్యమమే..**



మదర్ డెయిరీ ఆస్తులు అమ్మడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా? ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య చెప్పిన గ్రాంట్లు ఏమయ్యాయి..? లీటరుపై నాలుగు రూపాయల బోనస్ ఇవ్వకపోగా రేట్లు తగ్గించడం దారుణం. ఆస్తుల విక్రయం నిర్ణయాన్ని విరమించుకోవాలి. పట్టించుకోకుండా ముందుకు వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.

**- దొంతిరి సోమిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్**

## రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖశాంతులతో ప్రజలు తులతూగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే రాష్ట్ర ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు.

### సిరిసంపదలతో తులతూగాలి: ఎంపీ వద్దిరాజు



సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

## మూడు రోజుల్లో ఏపీ వైపు 1.78లక్షల వాహనాలు

- హైదరాబాద్ -విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ వాసులందరూ పల్లెబాట పట్టారు. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడ, కర్నూలు, తమిళనాడు వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతున్నది. చౌటుప్పల్, తుప్రాన్‌పేట, ఆందోల్ మైసమ్మ, పంతంగి టోల్ ప్లాజా తదితర ప్రాంతాల వద్ద పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారు. మూడు రోజుల్లో 11టోల్‌గేట్ల ద్వారా ఏపీ వైపు సుమారు 1,78,000 వాహనాలు వెళ్లాయి.

- హైవేపై కిక్కిరిసిన వాహనాలు



*హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా 16 టోల్‌బూత్‌లు ఉండగా.. విజయవాడ వైపు 11 బూత్‌లను తెరిచారు. గత సంక్రాంతికి 77వేల వాహనాల రికార్డు ఉండగా.. ఇప్పుడు 6వేలు అధికంగా వెళ్లడంతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది. – చౌటుప్పల్*

## రిటైర్మెంట్ సడలింపుపై వీసీల గుర్రు

- రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా!
- 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ బోధకుల కొనసాగింపు
- రెగ్యులర్ ప్రొఫెసర్లకూ అరవై ఏండ్లకే పదవీ విరమణ
- ఉన్నత విద్యామండలి తీరును వ్యతిరేకిస్తున్న వీసీలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిబంధనలంటే అందరికి సమానం. ఇక రిటైర్మెంట్ విషయంలో ఎవరికీ మినహాయింపేం కాదు. కానీ ఉన్నత విద్యామండలి మాత్రం ఈ విషయాన్ని విస్మరించి నడుచుకుంటున్నది. రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా నిబంధనలను అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నది. ఒకవైపు రెగ్యులర్ ప్రొఫెసర్లు 60 ఏండ్లకే పదవీ విరమణ పొందుతుండగా, 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించవచ్చని ఆదేశాలిచ్చింది. వర్సిటీలకు మండలి లేఖలు రాసింది. ఇది వివాదాస్పదమైంది. ఈ లేఖపై ఉన్నత విద్యామండలి వర్సెస్ వర్సిటీలు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇటీవల ఉన్నత మండలి అన్ని వర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో లేఖ ప్రస్తావన రాగా, ఓయూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదేం విధానమని, ఎలా కుదురుతుందని మండలి అధికారులను నిలదీసినట్టు తెలిసింది. అటానమస్ హోదా గల వర్సిటీల విషయంలో మండలి జోక్యం తగదని కొందరు వీసీలు అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. మండలి కేవలం సూచనలు, సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్టుగా అధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.



**అవసరముంటేనే తీసుకోవాలని సూచించాం**

వర్సిటీల్లో అవసరముంటే 60 ఏండ్లు దాటిన వారిని తీసుకోవాలని సూచన మాత్రమే చేశాం. అవసరాన్ని బట్టి పరిశీలించమన్నాం. అదేం జీవో కాదు. కేవలం సర్క్యులర్ మాత్రమే. అయినా కొనసాగించాలా.. లేదా అన్నది వీసీల ఇష్టం. తప్పనిసరిగా అమలుచేయాలన్న నింబంధనలేం లేవు.

**- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి**

## 'సంక్రాంతి' లింక్ క్లిక్‌చేస్తే లూటీ

- ప్రమాదకర మాల్‌వేర్‌తో సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ
- జాగ్రత్తలు పాటించాలంటున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'ఎంజాయ్ సంక్రాంతి స్పెషల్ ఫ్రీ రీచార్జ్.. 4 జీబీ డాటా వ్యాలిడ్ టిల్ యువర్ కరెంట్ ప్యాక్ వ్యాలిడిటీ. ఆల్సో గెట్ 2 జీబీ డాటా ఆన్ యువర్ నెక్ట్స్ రీచార్జ్' అంటూ ఓ సైబర్ మోసగాడి నుంచి ఫేక్ మెసేజ్. 'సంక్రాంతి పండుగ సందర్భంగా మీ నంబర్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. మీకు 10 జీబీ డాటా ఉచితంగా అందించబడుతుంది. దీని కోసం మేము పంపిన లింక్‌ను క్లిక్ చేసి, మీ వివరాలు పొందుపర్చండి. ఆ తర్వాత ఆ మెసేజ్‌ను 10 మందికి పంపితే మీకు పూర్తి ఉచితంగా 10 జీబీ డాటా లభిస్తుంది' అంటూ మరో కేటుగాడి మెసేజ్. ఇలా.. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రకటనలు, మెసేజ్‌లతో అమాయకులకు వల వేసి డబ్బులు లూటీ చేస్తున్నారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తమైంది.ఇలాంటి ప్రకటనలకు ఎవరూ ఆశపడొద్దని, లింకులను క్లిక్ చెయ్యొద్దని సూచిస్తున్నది.

## నా కుమారుడికి గుర్తింపు ఇవ్వలేదు

**ఓపెన్ ఏఐపై సుచిర్ బాలాజీ తల్లి ఆరోపణ • మరణంపై ఎఫ్‌బీఐ విచారణకు డిమాండ్**

న్యూఢిల్లీ, జనవరి 12: చాట్‌జీపీటీ అభివృద్ధిలో తన కుమారుడు ఎంతో కృషి చేసినప్పటికీ ఓపెన్‌ఏఐ సంస్థ మాత్రం తగిన గుర్తింపు ఇవ్వలేదని సుచిర్ బాలాజీ తల్లి అపర్ణారావు ఆరోపించారు. చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐలో సుచిర్ బాలాజీ నాలుగేండ్లు పని చేసి 2023 ఆగస్టులో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఓపెన్‌ఏఐ అనైతిక చర్యలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించి, పలు ఆధారాలను బయటపెట్టారు. ఈ క్రమంలో గత నవంబర్‌లో శాన్ ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో సుచిర్ బాలాజీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ విషయమై ఆయన తల్లి అపర్ణారావు మారియా నాఫల్ అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌తో మాట్లాడుతూ..'చాట్‌జీపీటీని వేగంగా, సమర్థంగా అభివృద్ధి చేయడానికి నా కొడుకు తోడ్పడ్డాడు. కానీ తను మరణించే వరకు తన పనికి గుర్తింపు దక్కలేదనే బాధ అతడిలో ఉండేది. ఇప్పుడు కూడా సుచిర్ సేవలకు ఓపెన్‌ఏఐ తగిన గుర్తింపు ఇవ్వకపోవడం దురదృష్టకరం' అని ఆమె పేర్కొన్నారు. తమ కుమారుడి మరణం ఆత్మహత్యలా లేదని, అసలు నిజాన్ని తేల్చడానికి ఎఫ్‌బీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

## సంక్రాంతి స్పెషల్ బాదుడు

- ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్న ఆర్టీసీ
- జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.240, నిర్మల్‌కు 650

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులపైన స్పెషల్ పేరిట ఆర్థిక భారం మోపుతున్నది రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (టీజీఎస్ఆర్‌టీసీ). పండుగకోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నది. స్పెషల్ బస్సుల పేరిట బోర్డులు తగిలించి ముక్కుపిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తున్నదని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్మల్, మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నుంచి నడిపిస్తున్న కొన్ని బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. మెదక్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 35 జడ్ 0022 బస్సు ఉదయం 7:30 గంటలకు జేబీఎస్‌కు చేరుకుంది. జేబీఎస్‌లో ఆ బస్సు ఎక్కిన ప్రయాణికులతో డ్రైవర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.160 చార్జి కాగా, అదనంగా రూ.80 వసూలు చేసి రూ.240 టికెట్ ఇచ్చాడు. అక్కడే ఉన్న మెదక్ డిపో మేనేజర్‌ను ఇదేమిటని అడుగగా, సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. జేబీఎస్ నుంచి నిర్మల్‌కు 650 వసూలు చేశారు.




ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్‌కు ఇద్దరికి ఇచ్చిన టికెట్ ధర

## బోధన్ ఆఫీసర్స్ క్లబ్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

**22 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్**

బోధన్, జనవరి 12: బోధన్ ఆఫీసర్స్ క్లబ్‌గా పేరొందిన పట్టణంలోని బోధన్ క్లబ్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల బృందం ఆదివారం ఆకస్మికంగా దాడి చేసింది. ఆఫీసర్స్ క్లబ్‌లో పేకాడుతున్న ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడిచేసి పేకాడుతున్న 22 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.31,200 నగదును, 52 పేకముక్కలు, 24 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను బోధన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడి సందర్భంగా ఆఫీసర్స్ క్లబ్ నిర్వాహకులు, టాస్క్‌ఫోర్స్ పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. తమకు పేకాట ఆడుకోవటానికి అనుమతి ఇస్తూ కోర్టు ఉత్వర్వులు ఇచ్చిందని, కోర్టు ఉత్తర్వులు ఎలా ధిక్కరిస్తారంటూ క్లబ్ నిర్వాహకులు వాదించారు. నిబంధనలకు విరుద్ధంగా పేకాడుతున్నందుకు పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

## బస్సులో ప్రయాణికురాలి మెడలో నుంచి గొలుసు చోరీ

వినాయక్‌నగర్, జనవరి 12 : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలి మెడలోంచి దుండగులు బంగారు గొలుసును చోరీ చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం, పెద్దాపల్లి గ్రామానికి చెందిన ఎం.పుష్పలత శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లో ఆర్గానిక్ ప్రొడక్ట్స్ కొనుగోలు చేసేందుకు వచ్చింది. అనంతరం నందిపేట్ బస్సులో నిజామాబాద్ బస్టాండ్‌కు వచ్చింది. అక్కడి నుంచి సాయంత్రం 6.07 గంటలకు కామారెడ్డి వెళ్లేందుకు నిజామాబాద్ బస్టాండ్‌లో బస్సుఎక్కింది. కామారెడ్డి వెళ్లిన అనంతరం బస్సు దిగగా ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు కనబడలేదు. ఈ విషయమై ఆదివారం నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు బస్టాండ్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. కంఠేశ్వర్ నుంచి బస్టాండ్‌కు ప్రయాణించిన సమయంలో తన బంగారు గొలుసు చోరీకి గురైనట్లు బాధితురాలు అనుమానం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లాలో సైతం ఫిర్యాదు చేయాలని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బాధితురాలికి సూచించారు.

### కారు, బైక్ ఢీ ఒకరు మృతి

మోపాల్ (ఖలీల్‌వాడి), జనవరి 12 : నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో ఒకరు అక్కడిక్కడే మృతి చెందారు. మోపాల్ ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బోర్గాం (పీ)కి చెందిన విజయ్‌కుమార్ (48) బైక్‌పై ఆదివారం మోపాల్‌కు వెళ్తుండగా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో విజయ్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

**ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి..**

మోపాల్ మండలంలోని అదే ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అధికారులు రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు. అక్కడే పెట్రోల్ బంక్‌లు, వైన్‌షాపులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హెచ్చరిక బోర్డులు పెట్టడంతోపాటు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ట్రాక్టర్, బైక్ ఢీకొని మరొకరు..

పొతంగల్, జనవరి 12 : ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది వద్ద ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎత్తొండ గ్రామానికి చెందిన యాదవ్ (35) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ట్రాక్టర్, బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వారికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తుండగా, మార్గమధ్యంలో యాదవ్ మృతిచెందాడు. భార్య, పిల్లలు చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## క్రీడా మైదానాలను చూసేవారెవరూ..?



*గోపాల్‌పేటలో ఆలనాపాలనా లేక నిరుపయోగంగా మారిన క్రీడామైదానం*

నాగిరెడ్డిపేట, జనవరి 12: మండలంలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో గత తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడామైదానాలు నేడు కళావిహీనంగా మారాయి. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామీణ యువతీ యువకులు శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు వారిలో దృఢత్వం పెంపొందించాలనే సదుద్దేశంతో.. తెలంగాణ ప్రభుత్వం స్థలం సేకరించి రూ.లక్షలు వెచ్చించి క్రీడామైదానాలను ఏర్పాటు చేసింది. క్రీడా వస్తువులను అందించింది. మైదానం చుట్టూ ఉపాధిహామీ పథకంలో ముళ్ల చెట్లతో కూడిన కంచెను ఏర్పాటు చేశారు. కాని నేడు అధికారుల పర్యవేక్షణలేక పిచ్చి మొక్కలకు నిలయంగా మారాయి. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మండల యువకులు కోరుతున్నారు.

## ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటిమట్టం

మోర్తాడ్, జనవరి 12: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు ప్రాంతంలో ఉన్న పంటలకు నీటివిడుదల కొనసాగుతున్నది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నది. కాకతీయ, వరద కాలువకు పెద్దమొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 282.317 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా ఇప్పటివరకు 225.250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1086.40 అడుగుల (64.402 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ఆదివారం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 2135 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 250, అలీసాగర్ ఎత్తిపోతలకు 360, గుత్ప ఎత్తిపోతలకు 270, సరస్వతీ కాలువకు 700, వరద కాలువకు 5 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**కందకుర్తి వద్ద తగ్గిన నీటిమట్టం..**

రెంజల్, జనవరి 12: గోదావరిలో నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నది. మొన్నటివరకు కందకుర్తి గోదావరి నది నిండుగా ఉండడంతో పురాతన శివాలయం మునిగి ఉన్నది. నదిలోని నీరు క్రమంగా తగ్గుతుండడంతో ఆలయ శిఖరం బయటపడుతున్నది.



*కందకుర్తి వద్ద బయటపడుతున్న ఆలయ శిఖరం*

## సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం



*వర్షిణిని సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు*

జక్రాన్‌పల్లి, జనవరి 12 : జమ్ముకశ్మీర్‌లో డిసెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు 37వ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జక్రాన్‌పల్లికి చెందిన గన్న వర్షిణి ప్రతిభ కనబర్చింది. సుద్దపల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్న వర్షిణి.. పోటీల్లో ప్రతిభ చూపి తెలంగాణ జట్టు విజయానికి కీలకపాత్ర పోషించింది. బంగారు పతకం అందుకుని ఆదివారం గ్రామానికి వచ్చిన సందర్భంగా వర్షిణికి గ్రామానికి చెందిన నాయకులు, యువజన సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో వర్షిణి తల్లిదండ్రులు గన్న లక్ష్మణ్, జ్యోత్స్న, మాజీ సర్పంచులు నర్సారెడ్డి, బాలకిషన్, మాజీ ఎంపీటీసీ సతీశ్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్‌నాయక్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి గంగామోహన్, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి సొప్పరి వినోద్, వ్యాయామ ఉపాధ్యాయులు గన్న దాస్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

## సైడ్ వాల్‌కు మరమ్మతు చేయరా..!



*పోచారం గేట్ల సమీపంలో కోతకు గురైన ప్రధానకాలువ సైడ్‌వాల్*

నాగిరెడ్డిపేట, జనవరి12: పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ సైడ్‌వాలు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రధాన కాలువ గేట్లకు సమీపంలోనే కాలువ సైడ్‌వాల్ నాలుగు సంవత్సరాల క్రితం కోతకు గురైంది. నేటి వరకూ అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో.. నీటి ప్రవాహానికి నిత్యం కోతకు గురి అవుతున్నది. ఇకనైనా నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి కాలువ సైడ్‌వాల్ మరమ్మతులు చేపట్టి, కోతకు గురికాకుండా చూడాలని మండల రైతులు అధికారులను కోరుతున్నారు.

## ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్



*వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి*

ఆర్మూర్‌టౌన్, జనవరి 12: చైన్ స్నాచింగ్ కేసులో ఆర్మూర్‌కు చెందిన భట్టు రాజ్, రాంనగర్ కాలనీకి చెందిన నూనె గంగాధర్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ఆదివారం విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. నిందితులు ఇటీవల పట్టణంలోని మూడు ప్రాంతాల్లో బంగారు గొలుసులను చోరీ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, 75 గ్రాముల బంగారు అభరణాలు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సై గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ

- దొంగకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

బోధన్ రూరల్, జనవరి 12 : ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగను గ్రామస్తులు పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో ఉన్న జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయంలో శనివారం రాత్రి ఓ దొంగ చోరీకి యత్నించాడు. హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డాడు. గ్రామస్తులు గమనించగా.. అక్కడి నుంచి దొంగ పరుగులు తీశాడు. గ్రామస్తులు వెంబడించి దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడి వద్ద రూ. 5 వేలు లభించాయి. నిందితుడిని బోధన్ పట్టణంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్లు లబ్ధిదారులకు అందేనా..?

నాగిరెడ్డిపేట, జనవరి 12: మండల కేంద్రం గోపాల్‌పేటలో మధ్యలో నిలిచిపోయిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయోనని గ్రామస్తులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గోపాల్‌పేటలో 2018లో డబుల్‌బెడ్‌రూం నిర్మాణాల కోసం అప్పటి ప్రభుత్వం మూడు ఎకరాల స్థలం కేటాయించి ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించింది. స్లాబ్ పనులు పూర్తి చేసినా గుత్తేదారు చేతులు ఎత్తేయడంతో.. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నేటికీ ఆరు సంవత్సరాలు పూర్తయినా పనులకు మోక్షం రావడం లేదు. వాటి నిర్మాణ సమయంలో లబ్ధిదారుల ఎంపిక సైతం అధికారులు పూర్తిచేశారు. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలు ఎప్పుడు పూర్తి చేస్తారో, తమకు ఇండ్లు ఎప్పుడు కేటాయిస్తారోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి అర్హులకు ఇండ్లను అందించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



*గోపాల్‌పేటలో స్లాబ్ వరకు పనులు పూర్తి చేసి వదిలేసిన డబుల్‌బెడ్ రూం ఇండ్లు*